క్లుప్తంగా

ఘనంగా గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గూడూరు: మండల పరిధిలోని పోసినవారిపాలెంలో నూతనంగా నిర్మించిన విజయ గంగానమ్మ అమ్మ వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. రూ.20 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణాన్ని గ్రామస్తులు చేపట్టారు. దీనిలో భాగంగా సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, బందరు పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, సర్పంచ్ పిండి రమాదేవి, వెంకన్న, శిరివెళ్ల గంగాబాబు, పోసిన రాఘవులు, నాయుడు చిన నాంచారయ్య, డేగల కృష్ణారావు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న ఎంపీ

గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారిని ఎంపీ వల్లభనేని బాలశౌరి దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఆయనను ఆలయ మర్యాదలతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ గుడివాడ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈడ సురేష్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డిస్పోజల్ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగ్గా ఉంటే ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని చెప్పారు.

పేదలకు న్యాయ సహాయం

మెడికల్‌కు సంబంధించిన పలు వేస్టేజ్‌ను బహిరంగ ప్రాంతాల్లో వేస్తున్నారని, వీటి ద్వారా వైరస్ వ్యాప్తి చెంది రోగాల బారినపడే అవకాశం ఉందన్నారు. ఇటువంటి వాటికి న్యాయపరంగా మెడికల్ సిబ్బంది బాధ్యులవుతారని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తోందన్నారు. ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారు తమకు దరఖాస్తు చేసుకుంటే వారికి న్యాయవాదిని నియమించి న్యాయసహాయం చేస్తామన్నారు. ఎన్ఆర్‌హెచ్‌ఎం డాక్టర్ సుదర్శన్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ముసలయ్య, జ్యోత్స్నశ్రీ ఉన్నారు.

పేదల పెన్నిధి పేర్ని కృష్ణమూర్తి

మేయర్ వెంకటేశ్వరమ్మ



పీకేఎం కాలనీలో నివాళులర్పిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు, నాయకులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలోని పేద ప్రజల పెన్నిధిగా మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తి పేరొందారని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. పేర్ని కృష్ణమూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఒకటో డివిజన్ పీకేఎం కాలనీలోని పేర్ని కృష్ణమూర్తి విగ్రహం వద్ద నిర్వహించారు.

కృష్ణమూర్తి ఆయన సతీమణి నాగేశ్వరమ్మల విగ్రహాలకు మేయర్‌తో పాటు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేదలకు కృష్ణమూర్తి ఇళ్ల స్థలాలు ఇచ్చి గూడు ఏర్పాటు చేశారన్నారు. ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించి ఉపాధి చూపారన్నారు. కృష్ణమూర్తిలానే ఆయన తనయుడు, మాజీ మంత్రి పేర్ని నాని కూడా పేదల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. పేర్ని నాని కూడా నగరంలో వేలాది మంది పేదలకు నివేశనా స్థలాలు ఇచ్చి పక్కా గృహ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. పేర్ని కిట్టు కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలూ కష్టపడుతున్నారన్నారు. నేడు పేర్ని అనే పదం ఒక బ్రాండ్‌గా మారిందన్నారు. కార్పొరేటర్లు పర్ణం సతీష్, ఐనం తాతారావు, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మట్టా తులసి, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, బత్తిన వాసు, పార్టీ నగర నాయకులు బందెల థామస్‌నోబుల్, ధనికొండ శ్రీనివాసరావు, షేక్ మహ్మద్ సాహెబ్, గంగుల నరసింహారావు పాల్గొన్నారు.

ఓగీస్‌పేటలో..

నగరంలోని 25వ డివిజన్ ఓగీస్‌పేట కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న పేర్ని కృష్ణమూర్తి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాలకు మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు నివాళులర్పించారు. ఆ డివిజన్ నాయకుడు కొలుసు హరిబాబు ఆధ్వర్యంలో కృష్ణమూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కరపాటి సత్యనారాయణ, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశాలకు హాజరు కావాల్సిందే !





సమావేశానికి హాజరైన సభ్యులు ; మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి

- అధికారులు రాకుంటే సమస్యల పరిష్కారమెలా ?
- హాజరు కాని వారికి నోటీసులివ్వాలని ఎంపీపీ వాణి ఆదేశం

పెడన: మండల సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీపీ రాజులపాటి వాణి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. సమావేశాలకు అధికారులు హాజరు కాకుండా, సభ్యులు చెబుతున్న సమస్యలకు మా పరిధి కాదని సిబ్బంది పేర్కొనడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రతి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని, పూర్తయిన సచివాలయం పరిధిలో అభివృద్ధికి రూ.40 లక్షలు కేటాయిస్తున్నారని తెలిపారు. వీటితో సచివాలయ పరిధిలో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసుకునేందుకు మంచి అవకాశం వచ్చిందన్నారు. అనంతరం పలు శాఖలపై సమీక్షించారు.

బ్యాంక్ రుణాల మంజూరు

వ్యవసాయశాఖపై ఏవో జీవీ శ్రీనివాసరావుకు సభ్యులు పలు సూచనలు చేశారు. మండలంలోని అన్ని ఆర్బీకేల్లో కాంప్లెక్స్ ఎరువులతో పాటు యూరియా, పొటాష్‌లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి వాటిని ఏర్పాటు చేయిస్తామని వారికి తెలిపారు. ఎంపీడీవో వి.రెడ్డయ్య మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు సంబంధించి చేతివృత్తుల వారి నుంచి దరఖాస్తులను ఈ నెల 17 నుంచి స్వీకరిస్తామన్నారు. ప్రతి సచివాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఈ దరఖాస్తులను తీసుకున్న అనంతరం అర్హులైన వారికి వారి వారి వృత్తి పరంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా బ్యాంక్ రుణాలు మంజూరు చేయిస్తామని చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచులు చేతి వృత్తుల వారిని ప్రోత్సహించి దరఖాస్తు చేయించాల్సిందిగా సూచించారు. నీటి పారుదల శాఖపై జరిగిన సమీక్షలో రామరాజు ఛానల్‌కు సంబంధించిన అధికారులు రాకపోవడంపై నందమూరు సర్పంచ్ పరసా నరసింహారావు మండిపడ్డారు. గత రెండు, మూడు సమావేశాల నుంచి కూడా సదరు అధికారి రావడం లేదని, సమస్య ఎప్పటికీ పరిష్కరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ వాణి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాలకు రాని అధికారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. నోటీసు కాపీని సదరు సర్పంచ్ కూడా అందజేయాల్సిందిగా ఎంపీపీ సూచించారు. అనంతరం వైద్యం, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఆర్టీసీ, విద్యుత్ శాఖలపై సమీక్షించారు.

ఎంపీపీకి సన్మానం

ఈ నెల 23తో ఎంపీపీ వాణి బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది వాణిని ఘనంగా సన్మానించారు. వీరితో పాటు సభ్యులు, వివిధ శాఖల అధికారులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, వైస్ ఎంపీపీ పరసా వాకాలమ్మ, మండల వ్యవసాయ సలహా సంఘ చైర్మన్ కాగిత వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

గోల్డ్ మెడలిస్ట్‌కు అభినందన



గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి బొత్స నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న శాంతి(ఫైల్)

మచిలీపట్నంటౌన్: స్థానిక నోబుల్ కళాశాలలో హిందీ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ పల్లికొండ శాంతికి ఆంధ్రా విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవం సందర్భంగా బంగారు పతకం ప్రధానం చేయడంతో కళాశాల బృందం సోమవారం ఆమెకు అభినందనలు తెలిపింది. విశాఖపట్నంలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో శాంతి అత్యుత్తమ పీహెచ్‌డీ థీసిస్‌గా గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. గోల్డ్ మెడల్‌ను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి బొత్స సత్యనారాయణ ఆమెకు అందజేశారు. నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే ఎర్నిస్ట్ కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది డాక్టర్ శాంతిని అభినందించారు.

28న హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు సోమవారం తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే లెక్కింపులో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు డ్రెస్ కోడ్‌లో హాజరుకావాలని సూచించారు. అదే రోజు ఉదయం 7 గంటలకు స్వామివారి శాంతి కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు.

ఎస్‌ఐ కిషోర్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



పమిడిముక్కల: పమిడిముక్కల ఎస్‌ఐగా సి.కిషోర్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిలకలపూడి పీఎస్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ సత్యన్నారాయణ వీఆర్‌కు వెళ్లారు. ఏఎస్‌ఐ ఆనందరావు, సిబ్బంది ఎస్‌ఐకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. సిబ్బంది పరిచయం చేసుకొన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని కిషోర్‌కుమార్ తెలిపారు.

టీడీపీ బంద్‌కు స్పందన కరువు



పెడనలో నడుస్తున్న ఆర్టీసీ బస్సు



అవనిగడ్డ వంతెన సెంటర్‌లో సాధారణ జనజీవనం

మచిలీపట్నంటౌన్/అవనిగడ్డ/కోడూరు/మోపిదేవి/చల్లపల్లి: మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో టీడీపీ సోమవారం తలపెట్టిన బంద్‌కు స్పందన కరువైంది. వర్తక, వాణిజ్య సంస్థలు యథాతథంగా పని చేశాయి. బ్యాంకులు, హోటళ్లు, సినిమాహాళ్లు, షాపింగ్‌మాల్స్, పెట్రోల్‌బంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. దివిసీమలో బంద్‌కు స్పందన లేదు. తెల్లవారు జామున ఐదు గంటలకే బంద్‌లో పాల్గొనాలని టీడీపీ, జనసేన నేతలు సామాజిక మాధ్యమాల్లో పిలుపు ఇచ్చినప్పటికీ ఒకరిద్దరు నాయకులు మినహా ఎవరూ బయలకు రాలేదు. సెక్షన్ 30, 144 అమలులో ఉండటంతో బయటకు వచ్చిన నాయకులను సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. కోడూరులో బంద్ పాక్షికంగా జరిగింది. టీడీపీ నాయకులు షాపులు, బ్యాంకులు, స్కూల్స్ వద్దకు వెళ్లి మూసేయాలని కోరారు. నాయకులు వెళ్లగానే మళ్లీ షాపులు తెరచుకున్నాయి. మోపిదేవిలో బంద్ పాక్షికంగా జరిగింది. టీడీపీ నాయకుల్లోనే సఖ్యత లేకపోవడంతో బంద్ సరిగా జరగలేదని ఆ పార్టీ నాయకులే చర్చించుకున్నారు. చల్లపల్లిలో బ్యాంకులు, ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా పని చేశాయి.

పెడనలో బంద్ నిల్

పెడన/కృత్తివెన్ను/గూడూరు/బంటుమిల్లి: పెడన నియోజకవర్గంలో బంద్ పాక్షికంగా జరిగింది. బంటుమిల్లి రోడ్డులో టీడీపీ నాయకులు ధర్నాకు దిగడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కృత్తివెన్నులో దుకాణాలు తెరుచుకోగా, ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలు ఇతర వాహనాలు నిరాటంకంగా ప్రయాణాలు సాగించాయి. బంద్ ప్రభావం మండలంలో ఏమాత్రం కనిపించలేదు. 144 సెక్షన్ ఆదేశాలను పెడన సీఐ ఎండీ హబీబ్ బాషా స్వయంగా పర్యవేక్షించారు. స్థానిక లక్ష్మీపురం సెంటర్‌లో సీఐ బాషా, ఎస్‌ఐ పైడిబాబులు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు రోజువారిగానే తిరిగాయి. బంద్‌పై హడావుడి చేసేందుకు ప్రయత్నించిన పలువురు టీడీపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ ఏ.పైడిబాబు తెలిపారు. గూడూరు మండలంలో బంద్‌కు స్పందన కనిపించలేదు. ఉదయం నుంచి బస్సులు, ఆటోలు యథావిధిగా రోడ్లపై తిరిగాయి. మల్లవోలు ప్రధాన కూడలి, రామరాజుపాలెంల్లో టైర్లు కాల్చి కొద్దిసేపు హడావుడి చేశారు. ఈ ఘటనలపై స్థానిక వీఆర్వోలు చలమలశెట్టి ప్రసాద్, కె.వెంకటేశ్వరరావులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ వి.వెంకటేష్ చెప్పారు.

ట్యాబ్‌ల వినియోగంలో మెలకువలు పాటించాలి



శిక్షణ ఇస్తున్న మహమ్మద్ దావూద్, పక్కన ఎంఈవో దుర్గాప్రసాద్ తదితరులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వినియోగంలో విద్యార్థులు మెలకువలు పాటించాలని, అప్పుడే ఎలాంటి సమస్యలు ఎదురుకావని బైజూస్ ట్యాబ్‌ల జిల్లా నోడల్ అధికారులు మహమ్మద్ దావూద్, పి.శివాజీ అన్నారు. స్థానిక రుస్తుంబాద మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌ల వినియోగంలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాబ్ అనుకోకుండా పగిలిపోతే స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేసి రసీదు పొందాలన్నారు. ట్యాబ్ దొంగిలించబడితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని ఉన్నతాధికారులకు అందజేయాలని చెప్పారు. ఎస్డీ కార్డు, క్యూ ఆర్ కోడ్ స్కాన్‌కు సంబంధించిన సమస్యలను ఎంఐఎస్ కోఆర్డినేటర్ ద్వారా జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. ట్యాబ్‌లోని యాప్‌లు పనిచేయకుంటే ఫ్యాక్టరీ రీ సెట్టింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంవీఎస్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమృద్ధిగా సాగునీటిని వినియోగించుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీకి అవసరమైన నీటి లభ్యత ఉన్న నేపథ్యంలో రైతులకు విడుదల చేసే సాగునీటిని సమృద్ధిగా వినియోగించుకోవాలని నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ టీజెహెచ్ ప్రసాద్‌బాబు తెలిపారు. కృష్ణ, తూర్పు డెల్టా పరిధిలోని అన్ని కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామని శివారు ప్రాంతాల్లో ఉన్న రైతులు కూడా తమ పంటలకు సాగునీటిని వినియోగించుకోవాలన్నారు. తాగునీటి చెరువులను కూడా నీటితో నింపుకోవాలని ఆయన సూచించారు.

రైతు కుటుంబానికి పీఏసీఎస్ సహాయం



మాజేరు(చల్లపల్లి): రైతు కుటుంబానికి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. చల్లపల్లి మండలం పాతమాజేరులో పీఏసీఎస్ సభ్య రైతు చోడగం పాండురంగారావు(91) ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబానికి మాజేరు పీఏసీఎస్ చైర్మన్ అరజా శివశంకర్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఎస్ఎస్ చక్రపాణి, పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు కుండపోత వర్షం కురిసింది. వర్షం దెబ్బకు వరి చేలల్లోకి భారీగా నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షానికి చెరువులు గండ్లు పడతాయని ఆక్వా రైతులు భయపడుతున్నారు. భారీగా కురిసిన వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించి పోయింది. మధ్యాహ్నం నుంచి వర్షం తెరిపి ఇవ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు



శ్రీనివాసరావు, కోడూరు ఎంపీడీవో



శ్రీనివాసరావు, మోపిదేవి ఎంపీడీవో

కోడూరు: నియోజకవర్గంలో పలువురు ఎంపీడీవోలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోడూరు ఎంపీడీవోగా ఆర్.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ బదిలీపై వెళ్లగా అప్పటి నుంచి ఈవోపీఆర్డీ డి.నాగరేవతి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. మంగళగిరి మండల ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు పదోన్నతిపై కోడూరు ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను పలువురు అభినందించారు.

మోపిదేవి ఎంపీడీవో నియామకం

మోపిదేవి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కోయ శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండల ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై మోపిదేవి ఎంపీడీవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న పీఓ రామలింగేశ్వరరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



పమిడిముక్కల: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ ఉష తెలిపారు. తాడంకి–2 సెంటర్‌లో సోమవారం పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు 3 నెలల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గంగాభవాని, పద్మావతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతుకు రూ.50 వేలు సహాయం



అశ్వరావుపాలెం(అవనిగడ్డ): మండల పరిధిలోని అశ్వరావుపాలెం రహదారికి మాదివాడ రవికుమార్, విజయ్‌భాస్కర్‌లు రూ.50 వేలతో మరమ్మతులు చేయించారు. ఈ రహదారిపై గోతులు పడటంతో విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తన తండ్రి మాదివాడ యతిరాజులు జ్ఞాపకార్థం కుమారులిద్దరూ రహదారికి మరమ్మతులు చేయించారు. రెడ్‌మిక్స్, జీఎస్బీ మెటీరియల్‌తో రహదారిపై పడిన గోతులను పూడ్చించారు. దాతలు మాదివాడ లక్ష్మీ, రవికుమార్, విజయ్‌భాస్కర్‌ను సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్, గ్రామస్తులు అభినందించారు.

ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే

తోట్లవల్లూరు: పాములలంకలో ఫీవర్ సర్వేను ఆరోగ్య సిబ్బంది సోమవారం నిర్వహించారు. తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న ఆదేశాలతో ఆరోగ్య సిబ్బంది పాములలంకలో ఇంటింటికీ వెళ్లి జ్వరాల సర్వే జరిపారు. ఇద్దరికి జ్వరం వచ్చి తగ్గిందని, మరో ఇద్దరు జ్వరంతో బాధపడుతున్నట్లు ఆరోగ్య సిబ్బంది గుర్తించారు. ఎంపీహెచ్ఎస్ అనిల్‌కుమార్, ఏఎన్ఎం అనిత, ఆశ కార్యకర్త దివ్య పాల్గొన్నారు.